హరీశ్‌రావును కలిసిన బీఆర్ఎస్ నేతలు

శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

రామచంద్రాపురం, మే 3 : మాజీ మంత్రి హరీశ్‌రావును బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డితో పాటు ఆర్సీపురం డివిజన్ బీఆర్ఎస్ నేతలు కలిశారు. ఆర్సీపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య పుట్టిన రోజు సందర్భంగా హరీశ్‌రావు ఆయనకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరికె జంగయ్య, నర్సింగ్‌రావు, కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన రిజర్వాయర్

చివరి దశకు చేరిన పనులు

ఉస్మాన్‌నగర్‌లో తుదిదశకు చేరిన తాగునీటి రిజర్వాయర్

రామచంద్రాపురం, మే 3 : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన తాగునీటి రిజర్వాయర్ పనులు చివరి దశకు చేరాయి. గతంలో తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసింది. దీంతో తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్‌లో సుమారుగా 27,497 ఇండ్లు, 55 కాలనీలకు ప్రయోజనం చేకూరుతుంది. 60 లక్షల లీటర్ల సామర్థ్యం గల రిజర్వాయర్ పరిధిలో సుమారుగా 20 కిలోమీటర్ల పైప్‌లైన్ వస్తుంది. రిజర్వాయర్‌ను ప్రారంభిస్తే గేటెడ్ కమ్యూనిటీలకు కూడా తాగునీటి సమస్య పరిష్కారమవుతుంది. బీఆర్ఎస్ హయాంలో తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న తాగునీటి సమస్యలపై స్పందించి హెచ్ఎండబ్ల్యూఎస్ ద్వారా నిధులు మంజూరు చేసింది. ఎక్కడా రిజర్వాయర్ పనుల్లో అంతరాయం జరుగకుండా చేపట్టి ప్రారంభానికి సిద్ధమైంది. శనివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులతో కలిసి రిజర్వాయర్‌ని పరిశీలించారు. రిజర్వాయర్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరలో రిజర్వాయర్‌ని ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో జలమండలి జీఎం సుబ్బరాయుడు, డీసీఎంలు చంద్రశేఖర్, శిరీష, కమిషనర్ సంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాములుగౌడ్, ఉమేశ్, రవీందర్‌రెడ్డి, నరసింహ, దేవేందర్, శ్రీనివాస్, మల్లారెడ్డి, కాంగ్రెస్‌నేత శ్యామ్‌రావు పాల్గొన్నారు.

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మే 3 : వేసవిలో రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి శనివారం తెలిపారు. ఎండలతో వడదెబ్బ ప్రమాదం పొంచి ఉన్నదని, ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి అన్నారు. ఎండలో ఎక్కువ సమయం ఉండరాదని, ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే టోపీ, గొడుగు వాడటం, సున్నితమైన దుస్తులు ధరించడం మంచిదన్నారు. తలనొప్పి, వాంతులు, మైకం, అధిక జ్వరం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

టెన్త్ టాపర్లకు బహుమతిని అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి

జిన్నారం, మే 3 : బొల్లారం మున్సిపల్ పరిధిలోని టెన్త్ క్లాస్ టాపర్లను మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి అభినందించారు. శనివారం బొల్లారం పబ్లిక్ స్కూల్ పదో తరగతి టాపర్లను మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి ప్రోత్సాహక బహుమతులను అందించి అభినందించారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులకు పిలుపునిచ్చారు. మాజీ ఎంపీటీసీ కృష్ణంరాజు, పాఠశాల కరస్పాండెంట్ ప్రభు కుమార్, డైరెక్టర్ సువర్ణ, ఉపాధ్యాయులు కవిత, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

జిన్నారం, మే 3 : గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని అలీనగర్ తెలంగాణ కాలనీలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. సర్వే నెంబర్ 27లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని వాపోయారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమన్నారు. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ ప్రారంభం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్

జిన్నారం, మే 3 : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని డిజైర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం సమ్మర్ క్యాంపు 2025ను యూఎస్ కౌన్సిల్ జనరల్ జెనీఫర్ లార్సన్, ప్రముఖ సినీ సంగీత దర్శకులు ఆర్పీ పట్నాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొదటిరోజు డాల్ క్యారెక్టర్స్, మ్యాజిక్ షో, మ్యూజికల్ చైర్స్, ఫ్యాషన్ షో కార్యక్రమాలను నిర్వహించారు. క్యాంప్ నిర్వహణకు ప్రత్యూష ఫౌండేషన్ నిర్వాహకులు విరాళాన్ని అందజేశారు. యాంకర్ జెమినీ సురేశ్, డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ సునీల్ కుమార్, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు 'నీట్'

తారా ప్రభుత్వ కళాశాలను పరిశీలిస్తున్న ఎస్పీ పారితోష్ పంకజ్

- జిల్లాలో 7 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- పరీక్షకు హాజరు కానున్న 3,320 మంది అభ్యర్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ పారితోష్ పంకజ్

సంగారెడ్డి కలెక్టరేట్, మే 3 : వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 4న ఆదివారం నిర్వహించే ప్రతిష్ఠాత్మక 'నీట్'కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 3,320 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఐఐటీ కంది, జేఎన్‌టీయూ సుల్తాన్‌పూర్‌లలో రెండు చొప్పున పరీక్షా కేంద్రాలు, సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాల, బాలుర ఉన్నత పాఠశాల, ఓడీఎఫ్‌లోని కేంద్రీయ విద్యాలయంలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పూర్తిగా సీసీ కెమెరా నిఘాలో నిర్వహించే నీట్‌కు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఒక్కో పరీక్షా కేంద్రానికి ఒక నోడల్ అధికారిని నియమించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగనుండగా, పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారని కలెక్టర్ వల్లూరు క్రాంతి వెల్లడించారు. నిర్ణీత సమయం తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అభ్యర్థులను పరీక్షా కేంద్రంలో అనుమతించరని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రంలోకి వెళ్లే ముందే అభ్యర్థుల బయోమెట్రిక్ నమోదు చేస్తారని, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు విధిగా అడ్మిట్ కార్డుతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఒక ఐడీ ప్రూఫ్ తమ వెంట తెచ్చుకోవాలన్నారు. దివ్యాంగ అభ్యర్థులు తమ అంగవైకల్య ధ్రువీకరణ పత్రం తెచ్చుకోవాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి పెన్నులు, పెన్సిళ్లు, ఏ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు, గడియారాలకు అనుమతి లేదన్నారు.

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ

పట్టణంలోని పరీక్షా కేంద్రాలని ఎస్పీ పారితోష్ పంకజ్ సందర్శించారు. ఈ క్రమంలో స్థానిక తారా ప్రభుత్వ కళాశాలను సందర్శించిన ఎస్పీ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతి గదిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను, క్యారిడార్ సీసీ కెమెరాలను పరిశీలించారు. కళాశాల చుట్టూ కలియదిరుగుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని డీఎస్పీ సత్తయ్య గౌడ్‌ను ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీ సత్తయ్య గౌడ్, పట్టణ సీఐ రమేశ్, కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్, సహాయ చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్, అబ్జర్వర్ విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

మంజూరైన ఇండ్లకు దక్కని మోక్షం

- తలరాతలు మారుతాయనుకుంటే, మా రాతలు తలకిందులయ్యాయని వాపోతున్న లబ్ధిదారులు

స్లాబ్ లెవెల్‌లో నిలిచిపోయిన ఇల్లు, కూలిపోయిన ఇంట్లోనే బతుకుతున్న పొన్నబోయిన దుర్గమ్మ, మనమరాలు

గుమ్మడిదల, మే 3 : బీఆర్ఎస్ హయాంలో పేదలకు ఇండ్లు మంజూరయ్యాయి. సొంత స్థలంలో ఇండ్లు నిర్మాణాలు చేసుకుంటే రూ. 3 లక్షలు ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. వారికి స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సైతం ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. దీంతో తమకు ఇండ్లు మంజూరయ్యాయని సంతోషంతో ఇంటి నిర్మాణాలు చేసుకున్నారు. కొంత మంది ఇండ్లు నిర్మించుకోగా, మరి కొంత మంది స్లాబ్ లెవల్‌లో నిర్మాణాలు చేసుకున్నారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడం కాంగ్రెస్ సర్కారులో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి పాలన కొనసాగుతుండడంతో లబ్ధిదారుల తలరాతలు తలకిందలైనాయి. అప్పులు చేసి ఇంటి నిర్మాణాలు చేసుకున్న వారికి చివరికి కన్నీళ్లే మిగిలాయి. ఇడ్లు నిర్మించుకుంటూటే రూ.3 లక్షలు వస్తుందనుకున్న లబ్ధిదారులకు కలగానే మిగిలి పోయింది. ఇది రాష్ట్ర వ్యాప్తంగాలబ్ధిదారులు ఎదురు కొంటున్న సమస్యగానే మిగిలిపోయింది. గుమ్మడిదల మండలంలో కేసీఆర్ పాలనలో గుమ్మడిదల మండల వ్యాప్తంగా అర్హులైన పేదలకు ఇండ్లు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా వీరన్నగూడెంలో 48 మందికి ఇండ్లు మంజూరు కాగా, వీరిలో 14 మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేసుకున్నారు. కొందరు డబ్బులు లేక మధ్యలోనే నిలిపి వేశారు. ఇది ఒక వీరన్నగూడమే కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా ఇది ఒక పెద్ద సమస్యగానే మిగిలిపోయింది. ఇలాంటి వారి పరిస్థితిపై సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు స్పందించి తగిన న్యాయం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..

బీఆర్ఎస్ హయాంలో సర్కారు ఇల్లు మంజూరైంది.. ప్రొసీడింగ్ కాగితాలను అధికారులు ఇచ్చిర్రు. రూ. 3 లక్షలు వస్తాయని చెప్పిర్రు. ఆసంతోషంతో ఇడ్లు స్లాబ్‌లెవెల్ కట్టుకున్న.. అంతలో ఎన్నికలు వచ్చినాయి.. సర్కారు మారిపోయింది. అప్పటి సీఎం కేసీఆర్ ఇప్పుడు లేడు.. ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో అప్పుడు ఇచ్చిన ప్రొసీడింగ్ ఇప్పుడు పని చేయదా.. అప్పులు చేసిన ఇడ్లు కట్టుకున్న మా పరిస్థితి ఎట్లా? ఇల్లు పూర్తి కాక ఇప్పుడు కూలిపోయిన ఇంట్లోనే కాలం వెల్లదీస్తున్నాం. అప్పుడు ఇల్లు మంజూరైన వాటిని పట్టించుకొని ఇందిరమ్మ ఇంటికి వచ్చే రూ. 5 లక్షలు ఇస్తే బాగుంటుంది.

-పొన్నబోయిన దుర్గమ్మ, వీరన్న గూడెం, గుమ్మడిదల మండలం

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ పారితోష్ పంకజ్

పోక్సో కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

నేర సమీక్షలో ఎస్పీ పారితోష్ పంకజ్

సంగారెడ్డి మే 3 : జిల్లాలో నమోదైన లైంగికదాడి, పోక్సో కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నిర్ణీత గడువులో దోషులను న్యాయస్థానం ముందు ఉంచాలని జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ పోలీసు అధికారులకు సూచించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ పారితోష్ పంకజ్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని డీఎస్పీలకు సూచించారు. దీర్ఘకాలికంగాపెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రతి సర్కిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం మిస్సింగ్ కేసులు, ఎన్‌బీడబ్ల్యూ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అదనపు ఎస్పీ సంజీవరావుతోపాటు దర్యాప్తు బృందం సభ్యులను ఎస్పీ అభినందించారు. ఆస్తి సంబంధిత నేరాల్లో పాతనేరస్తులపై నిఘా ఉంచాలని, గంజాయి స్మగ్లర్ల ఆస్తులను కోర్టుకు అటాచ్ చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌బెట్టింగ్, బెట్టింగ్‌యాప్స్, ఆన్‌లైన్ మోసాలు, డ్రగ్స్ వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలని తెలిపారు. ఆన్‌లైన్ మోసాలు జరగకుండా సైబర్ వింగ్ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీలు సత్తయ్యయగౌడ్, రవీందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు చేపట్టాలి

హుసెల్లి గ్రామ శివారులోని చెక్‌పోస్టును పరిశీలించిన ఆర్డీవో రాంరెడ్డి

హుస్సేలి సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలిస్తున్న జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి

జహీరాబాద్, మే 3 : అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని హుస్సెల్లి గ్రామ శివారులోని తెలంగాణ-కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని చెక్‌పోస్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న లారీలపై నిఘా పెట్టాలన్నారు. సరిహద్దు చెక్‌పోస్టు వద్ద రెవెన్యూ, పోలీసుల సహకారంతో 24 గంటల పాటు తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ అనుమతితో లారీల్లో ఇసుక తీసుకెళ్తున్నారా ? లేక ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నారా అనేది క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలించే లారీలను పట్టుకుని సీజ్ కేసి కేసులను నమోదు చేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టు వద్దనే పట్టుకున్న ఇసుకను డంపింగ్ చేయాలన్నారు. ఆయన వెంట మండల డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, ఆర్డీవో కార్యాలయ అధికారి జైపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

7 తేదీ వరకు ఎర్లీ బర్డ్ స్కీమ్ పొడిగింపు

జిన్నారం, మే 3 : ఆస్తి పన్ను చెల్లింపులకు సంబంధించి ఎర్లీ బర్డ్ పథకాన్ని ఈనెల 7వ తేదీ వరకు పొడిగించినట్లు బొల్లారం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి శనివారం తెలిపారు. ఈ అవకాశాన్ని గృహ యజమానులు, పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకొని ఐదు శాతం రాయితీతో పన్ను చెల్లించవచ్చన్నారు. ఇప్పటికే జిల్లాలో పన్ను వసూళ్లలో బొల్లారం మున్సిపాలిటీ ప్రథమ స్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే.

వివరాలు వెల్లడిస్తున్న డీటీఎఫ్ సీఐ గోపాల్

1.3 కిలోల గంజాయి పట్టివేత

నర్సాపూర్,మే 3 : తూప్రాన్ పట్టణంలో 1.3 కిలోల గంజాయిని పట్టుకున్నామని ఎక్సైజ్ డీటీఎఫ్ సీఐ గోపాల్ తెలిపారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో నిందితుడిని మీడియా ఎదుట ప్రవేశపెట్టి వివరాలను వెల్లడించారు. తూప్రాన్ పట్టణంలో అక్రమంగా గంజాయి అమ్ముతున్నారనే సమాచారం మేరకు తూప్రాన్ నుంచి నర్సాపూర్ వెళ్లే చౌరస్తాలో నిఘా ఏర్పాటు చేశామన్నారు. ముఖాన్స, నర్సింహులు గంజాయి అమ్మడాన్ని గుర్తించామన్నారు. సిబ్బందితో కలిసి చుట్టుముట్టి ముఖాన్సను పట్టుకొని అతడి వద్ద గల సంచిలో తనిఖీ చేయగా, అందులో దాదాపు 1. 3 కిలోల ఎండు గంజాయిని లభించిందని తెలిపారు. విచారించగా, హైదరాబాద్ నుంచి గంజాయిని తీసుకువచ్చి అమ్ముతున్నామని ఒప్పుకున్నాడు. నర్సింహులు అనే వ్యక్తి పరారీలో ఉన్నాడని అతడిపై కేసు నమోదు చేశామని తెలిపారు. నర్సింహులును త్వరలో పట్టుకొని కోర్టులో హాజరుపరుస్తామని వెల్లడించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టోర్నీలో జహీరాబాద్ జట్టు విజయం

రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీలో విజయం సాధించి ట్రోఫీ, నగదును అందుకుంటున్న జహీరాబాద్ జట్టు

జహీరాబాద్, మే 3 : బసవ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో జహీరాబాద్ జట్టు విజయం సాధించింది. శనివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జరిగిన మ్యాచ్‌లో జహీరాబాద్ రాష్ట్రీయ బసవదళ్ క్రికెట్ జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా రాష్ట్ర వీరశైవ బలిజ సంఘం అధ్యక్షుడు ఈశ్వరప్ప ట్రోఫీ, రూ. 55 వేల నగదును అందజేశారు. నాయకుడు సంగమేశ్వర్ పాల్గొన్నారు.

88వ రోజుకు చేరిన డంపింగ్ యార్డు దీక్షలు

ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహారదీక్ష చేస్తున్న మహిళలు

గుమ్మడిదల, మే 3 : ప్యారానగర్ డంపింగ్‌యార్డును వ్యతిరేకిస్తూ కొనసాగుతున్న రిలే నిరాహారదీక్షలు 88వ రోజుకు చేరుకున్నాయి. శనివారం గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల్లో డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా జేఏసీ నాయకులు, మహిళా సంఘాలు రిలే నిరాహారదీక్షలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్యారానగర్ సమీపంలో నిర్మిస్తున్న డంపింగ్‌యార్డు (ఎంఎస్‌డబ్ల్యూ)ను వెంటనే రద్దు చేసి ఇక్కడి గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో రైతు జేఏసీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో నవగ్రహ పూజలు

పూజలు చేస్తున్న పటాన్‌చెరు బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

అమీన్‌పూర్, మే 3 : సుల్తాన్‌పూర్‌లో ఉన్న హనుమాన్ దేవాలయంలో కొత్తగా నవగ్రహ దేవతల విగ్రహాలను శనివారం ప్రతిష్ఠాపన చేశారు. పూజలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, బీఆర్ఎస్ యువ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్, కృష్ణారెడ్డిపేట మాజీ సర్పంచ్ కృష్ణ, నాయకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో..

అన్నదానంలో పాల్గొన్న ఆదర్శ్‌రెడ్డి దంపతులు

రామచంద్రాపురం, మే 3 : భారతీనగర్ డివిజన్‌లోని బీడీఎల్ కాలనీలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రొటెం మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని శనివారం ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అంతకుముందు కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్షలు, ఆయుర్వేద, డెంటల్ శిబిరాలను ఆమె ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, అంజయ్య, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారులు

హత్నూర, మే 3 : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని జోగిపేట ఏడీఏ రమాదేవి తెలిపారు. శనివారం హత్నూర మండలం కాసాల రైతువేదికలో మండలంలోని ఎరువుల దుకాణాల డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలోనే ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండటంతో రైతులకు అందుబాటులో ఎరువులను ఉంచేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్‌రావు, ఏఈవో మహేందర్, రమేశ్, మనీషా తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

విద్యార్థులను సన్మానించిన గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు

జహీరాబాద్, మే 3 : పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జహీరాబాద్ పట్టణంలోని రంజోల్ గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు సన్మానించారు. శనివారం స్థానిక గ్రామంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని 600 మార్కులకు 500లకు పైగా అత్యధిక మార్కులను సాధించిన విద్యార్థులు వినాయక, భావని, ఫర్హీల్‌లకు గ్రామానికి చెందిన జిల్లాయువజన నాయకుడు నగేశ్ గౌడ్ సన్మానించి, ఒక్కొక్కరికి రూ. ఐదు వేల చొప్పున నగదు పురస్కారాన్ని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వైద్యనాథ్, మాజీ ఎంపీటీసీ ఖలీల్, నాయకులు రవీందర్ రెడ్డి, చంద్రన్న, గుండారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

జిన్నారంలో..

జిన్నారం, మే 3 : జిన్నారం మండల కేంద్రానికి చెందిన కోరబోయిన సామయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నాయకులు సుధాకర్, నరేశ్, హిందూ పరిరక్షణ సమితి సభ్యులు ఆనంద్ చారి, విష్ణుమూర్తి, శ్రీనివాస్ యాదవ్, లక్ష్మణ్ గుప్తా, రామ్మూర్తి చారి ఉన్నారు.

5 తేదీ నుంచి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

జహీరాబాద్, మే 3 : ప్రొఫెసర్ జయశంకర్‌సార్ తెలంగాణ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు మెరుగైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు సదస్సులను నిర్వహిస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని బసంతపూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం, రాష్ట్ర చెరుకు అభివృద్ధి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుంచి జూన్ 13 వరకు జిల్లాలోని వివిధ గ్రామాల్లో రైతులకు సాగులో అనుసరించాల్సిన ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాగునీటి పద్ధతులు, పంట మార్పిడి, అధిక దిగుబడులు, చీడపురుగుల నివారణ చర్యలపై సలహాలు, సూచనలను ఇవ్వనున్నారు. పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, కంది ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ అవగాహన సదస్సులకు జిల్లాలోని రైతులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సూచించారు.

రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి

జహీరాబాద్, మే 3 : తెలుగు రాష్ట్రాల్లోని రైతులకు నాణ్యమైన సేంద్రియ, జీవన ఎరువులు, రసాయన మందులతో పాటు మెరుగైన సేవలను అందించేందుకు పుష్కల్ అగ్రిటెక్ లిమిటెడ్ కంపెనీ శాయశక్తుల కృషి చేస్తున్నామని శివశక్తి గ్రూప్స్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ నందిగం శ్రీనివాస్‌రావు తెలిపారు. శనివారం జహీరాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన పుష్కల్ అగ్రిటెక్ లిమిటెడ్ రిటైల్ అవుట్ లేట్ దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ శివసాగర్, డిప్యూటీ మేనేజర్ రాజేశ్ కుమార్, స్టోర్ మేనేజర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ అరెస్టు

అందోల్, మే 3 : చైన్ స్నాచర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు శనివారం జోగిపేట ఎస్సై పాండు గౌడ్ తెలిపారు. జోగిపేటకు చెందిన నిర్మల సంగుపేట చౌరస్తా వద్ద నిలబడి ఉండగా గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి మెడలోంచి పుస్తెలతాడు తెంపుకొని పారిపోయేందుకు యత్నించాడు. దీన్ని గమనించిన స్థానికులు అతడిని పట్టుకొని చితకబాది పోలీసులకు అప్పగించారు. చైన్ స్నాచర్స్‌కు పాల్పడిన వక్తి వివరాలను సేకరించగా, పుల్కల్ మండలం మిన్పూర్ గ్రామానికి చెందిన లష్కరి సుభాష్‌గా గుర్తించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.